క్లుప్తంగా

అన్నదానానికి వితరణ



విరాళం అందజేస్తున్న గౌరినాయుడు

పాలకొండ రూరల్: సత్యసాయి సేవాసమితి ద్వారా పేదలకు నిత్యం అందిస్తున్న అన్నదాన సమారాధనకు వీరఘట్టం మండలం బిటివాడకు చెందిన ఎస్.గౌరినాయుడు రూ.50 వేలు వితరణగా అందించారు. స్థానిక సత్యసాయి మందిరంలో దాత తన కుటుంబ సభ్యులతో కలిసి సమితి సభ్యుడు ఎన్వీ రమణ ద్వారా ఈ మొత్తాన్ని అందజేశారు. పేదల ఆకలి తీర్చే ఇటువంటి కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో జై గురుదత్త హోమాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీ సాయి మందిరంలో గురువారం దేవి సహిత జైగురుదత్త హోమములు వేడుకగా జరిగాయి. ఉదయం సుప్రభాతసేవ, కాకడహరతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్వీఎల్ఎన్.శర్మయాజీ సహకారంతో ఆలయ అర్చకులు ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీజైగురుదత్త హోమములను నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



గాయాలతో చికిత్స పొందుతున్న పార్టీ కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: మండలంలోని పినపెంకి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చొక్కాపు నాగభూషణరావును ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పరామర్శించారు. కొన్నిరోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగభూషణరావు గాయాలపాలై, మంచంపై ఉన్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయనను గురువారం కలిసి ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకుని, పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

కారాడలో 'వైఎస్సార్ పొలంబడి'



తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ శ్యామ్‌సుందర్

బొబ్బిలి రూరల్: మండలంలోని కారాడ గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.శ్యామసుందర్ అపరాల పంటలకు సోకుతున్న తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పూత, పిందె సమయంలో కాయతొలుచుపురుగు, పల్లాకు తెగులు వస్తోందని వీటి నివారణకు మోనోక్రోటోఫాస్, కార్బన్డిజం అనే పాడిమందును 250 గ్రాములు, వేపనూనెను ఎకరానికి అర లీటరు చొప్పున కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే తెల్లదోమ, శనగపచ్చపురుగు గుర్తించేందుకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సంతోషి, మాధురి, రమ్య పాల్గొన్నారు.

20న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

బాడంగి: స్థానిక స్వామి కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నేతలు గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆరంభమయ్యే ఈ సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలంతా హాజరుకావాలని కోరారు.

90 శాతం ధాన్యం సేకరణ పూర్తి

రామభద్రపురం: మండలంలో దాదాపు 90 శాతం మేర ధాన్యం సేకరణ పూర్తయిందని ఎంపీడీఓ రమామణి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సందర్శించిన ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ధాన్యం సేకరణ, బిల్లుల చెల్లింపులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 1,212 మంది రైతుల దగ్గర నుంచి 4,891 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. ఇప్పటివరకు 1,130 మంది రైతులకు రూ.8.10 కోట్ల బిల్లులు చెల్లించామన్నారు. మరో 120 మంది రైతులకు రూ.70 లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పగడ్బందీగా చర్యలు తీసుకుంటోందన్నారు.

ప్రభుత్వ పథకాలపై సర్వే

- మన్యం గ్రామాల్లో పర్యటించిన కేంద్ర బృందం



ముత్యాలు గ్రామంలో పసుపు యంత్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

సీతంపేట: మన్యం గ్రామాల్లో పీవీటీజీ గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయనే విషయమై పరిశీలనకు కేంద్ర బృందం గురువారం సీతంపేట ఏజెన్సీలో పర్యటించింది. దీనిలో భాగంగా ట్రైఫాడ్ డిప్యూటీ మేనేజర్ భోళాశంకర్ ఆధ్వర్యంలో పలు గ్రామాలను బృందం సభ్యులు సందర్శించారు. గిరిజనులతో స్వయంగా మాట్లాడారు. సోషల్ అండ్ ఎకానమి యాక్టివీటిలను పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏఏ పథకాలు అమలు చేస్తున్నాయి?, గిరిజనులకు ఇవి ఏ మేర ఉపయోగపడుతున్నాయనేది పరిశీలించారు. గ్రామాల్లో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. మాతా శిశుమరణాల గూర్చి వివరాలు తెలుసుకున్నారు. ముందుగా ముత్యాలు గ్రామాన్ని సందర్శించారు. అక్కడ పసుపు ఉడకబెట్టే యంత్రాలను పరిశీలించారు. దీని వల్ల రైతులకు ఎటువంటి ఉపయోగాలున్నాయో తెలుసుకున్నారు. గతంలో పసుపు పంట తవ్విన తర్వాత ఉడక బెట్టడానికి నానా అవస్థలు పడేవారమని, ఇప్పుడా పరిస్థితి లేదని తక్కువ సమయంలో పసుపు ఉడికిపోతుందన్నారు. అనంతరం అక్కన్నగూడ గ్రామంలో గిరిజనులతో మాట్లాడారు. సీతంపేటలో ఏర్పాటు చేసిన జీడి ప్రాసెసింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. మల్లి సీవోఈ కళాశాలను సందర్శించి ఇంటర్మీడియెట్ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ రోసిరెడ్డి, వెలుగు ఏపీడీ నారాయణరావు, ఎడ్యుకేషన్ ఓఎస్‌డీ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల ఫలాలు విద్యార్థులకు అందాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంక్షేమ శాఖ అధికారులు

పాలకొండ: ప్రభుత్వం అందిస్తున్న పథకాలు విద్యార్థులకు అందేలా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పని చేయాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, జగనన్న తోడు, జగనన్న చేదోడు, జగనన్న అమ్మఒడి అందించేలా వారి వివరాలను పూర్తి స్థాయిలో సేకరించాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలోనే అర్హులను గుర్తించి వారికి పథకాలు అందించాలని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చాలి



సమావేశంలో విధులను వివరిస్తున్న ఏపీఎం భవానీ

భామిని: ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరాలంటే మహిళా స్వయంశక్తి సంఘాల సభ్యులతో సమావేశాలను నిర్వహిస్తూ వాటిని బలోపేతం చేయాలని వెలుగు ఏపీఎం దొడ్ల భవాని అన్నారు. వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన వీఓఏల సమావేశంలో ఆమె మాట్లాడారు. బ్లాక్ బోర్డుపై వీఓఏ విధులకు సంబంధించి అవగాహన కల్పించారు. ఎస్‌హెచ్‌జీల బలోపేతానికి తమ వంతు కృషి చేయాలన్నారు. మగ సీఎఫ్‌లున్న చోట రాత్రిపూట గ్రామైక్య సంఘాల సమావేశాలు నిర్వహించొద్దని సూచించారు. గ్రామైక్య సంఘ సమావేశాలకు సంఘం ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్లు మాత్రమే హాజరయ్యేలా చూడాలన్నారు. సీసీలు ప్రతి సమావేశానికి సంబంధించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. సభ్యులు విధిగా రికార్డులతో హాజరయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో సీసీలు, సీఎఫ్‌లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



జగదీష్‌కుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: వెంకటరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: మండలంలోని తంపటాపల్లి గ్రామానికి చెందిన ఏజీపీ చంక జగదీష్‌కుమార్‌ను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం పరామర్శించారు. జగదీష్ తండ్రి స్వామినాయుడు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జగదీష్‌ను పరామర్శించి ఓదార్చారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఆమె వెంట ఏఎంసీ వైస్ చైర్మన్ పాట్నూరు లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్మన్ కర్రి గోవిందరావు, మండల పార్టీ కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్‌రావు, కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, కడగల రమణ, నీలాపు శ్రీనివాసరావు, కిల్లారి మోహన్ ఉన్నారు.

వీరఘట్టం: ఇటీవల మృతి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యురాలు చందక పద్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పరామర్శించారు. గురువారం తూడి గ్రామానికి వెళ్లి మృతురాలి భర్త వెంకటరావుతో ఎమ్మెల్యే మాట్లాడారు. పద్మ ఆత్మకు శాంతి కలగాలని కోరారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యేతో పాటు వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పాట్నూరు లక్ష్మణరావు తదితరులున్నారు.

పుస్తక పఠనంతో మేలు



మాట్లాడుతున్న కుమారరాజు

సీతంపేట: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం అలవర్చుకోవాలని తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కుమారరాజు అన్నారు. స్థానిక గ్రంథాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగులు చదువుకోవడానికి అన్ని రకాల పోటీ పుస్తకాలు అందుబాటులో ఉంచామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇక్కడ గ్రంథాలయంలో గ్రూప్ వన్, టుతో పాటు ఇతర పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్ ఉందన్నారు. త్వరలో ఈ గ్రంథాలయంలో నాడు – నేడు పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. గ్రంథాలయంలో రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట గ్రంథాలయాధికారి గణేష్, అసిస్టెంట్ రామకృష్ణ తదితరులు ఉన్నారు.

జేసీఎస్ కోఆర్డినేటర్‌గా చంద్రశేఖర్



మాట్లాడుతున్న జేసీఎస్ మండల కన్వీనర్ చంద్రశేఖర్

భామిని:

వైఎస్సార్‌సీపీ జేసీఎస్ భామిని మండల కోఆర్డినేటర్‌గా బాలేరు ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం అధ్యక్షతన గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన విధులను చేపట్టారు. ఉత్తరాంధ్ర జేసీఎస్ కో ఆర్డినేటర్ హర్షవర్ధనరెడ్డి ఆదేశాల మేరకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు వారధులుగా తాము పని చేస్తామని చంద్రశేఖర్ వెల్లడించారు. తక్షణమే గృహసారథులు జాబితాలు సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలోని 48 మంది సచివాలయ కన్వీనర్లతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, జిల్లా కార్యదర్శి కొవ్వాడ చిరంజీవులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కె.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, డైరెక్టర్ కాగితాపల్లి కృష్ణారావు, బాలేరు, బురుజోల సర్పంచులు జామి ప్రభాకర్, ఎం.కేశవరావు, గేదెల మోహనరావు, కిల్లారి చంటి తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదశిర్లాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రేగిడి: మండలంలోని పెదశిర్లాం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు గురువారం విలేకరులకు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలంతా హాజరుకావాలని వారు కోరారు.

సమన్వయంతో పనిచేయాలి

బొబ్బిలి: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, వలంటీర్లంతా సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు కోరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బొబ్బిలి జేసీఎస్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన రేజేటి ఈశ్వరరావు(విసు) ఎమ్మెల్యేను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలన్నారు. పార్టీ పటిష్టతకు కృషి చేసిన వారికి పార్టీలో ఎప్పుడూ సముచిత గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ రియాజ్‌ఖాన్, ఏఎంసీ డైరెక్టర్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

రాజాం: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీల వారీగా పూర్తయిన గ్రామసచివాలయ సముదాయ భవన నిర్మాణాలపై ఆరాతీశారు. పెండింగ్‌లో ఉన్న భవనాలను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా ఏదైనా సమస్య వల్ల నిర్మాణాలు జరగకుండా ఉంటే ఆ విషయాన్ని తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం 14వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, 15వ ఆర్థిక సంఘం నిధుల ప్రణాళికలు, పనులు అంశాలపై కొంతసేపు మాట్లాడి, పలు సూచనలు చేశారు. అలాగే మండలంలో బడ్జెట్ వివరాలు, వాటి వినియోగం, ఇతర అంశాలపై చర్చించారు. ప్రతీ సోమవారం అన్ని సచివాలయాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించాలని, కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించాలని సూచించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు వేసవికాలం దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా తాగునీటి సమస్యల లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, రాజాం ఎంపీడీఓ బాసూరి శంకరరావు, పీఆర్‌డీఈఈ యు.జయప్రకాష్, పీఆర్ జేఈ ప్రభాకరరావు, ఈఓపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ పరిశీలన



రేజేరులో భూ హక్కు పత్రాల పంపిణీని పరిశీలిస్తున్న ఆర్డీఓ శేషశైలజ

బాడంగి: మండలంలోని రేజేరు గ్రామంలో జరుగుతున్న భూ హక్కు పత్రాల పంపిణీని బొబ్బిలి ఆర్డీఓ పి.శేషశైలజ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె భూముల రీసర్వే అనంతరం వచ్చిన భూ హక్కు పత్రాలు ఏ మేరకు సరిగ్గా వచ్చాయో రైతులను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే అధికారులను సంప్రదిస్తే సరిచేస్తారని తెలిపారు. మండలంలో ఇంకా భూముల రీసర్వే జరగాల్సిన గ్రామాల్లో కూడా సర్వే త్వరితగతిన చేపట్టి, పూర్తి చేయాలని ఆర్డీఓ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామసచివాలయం సందర్శించి సూచనలు చేశారు.

ప్రాణం విలువైనది



వాహన తనిఖీలు చేస్తున్న సీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: మనిషి ప్రాణం చాలా విలువైనదని నిర్లక్ష్యంతో వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. మండలంలోని కళిగొట్టు జంక్షన్ వద్ద ఎస్ఐ ఎస్.షన్ముఖరావుతో కలిసి వాహన తనిఖీలు గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన రహదారి మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలను నిలుపుదల చేసి క్షుణ్ణంగా పరిశీలన చేశారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు, లైసెన్సులు, హెల్మెట్లను కూడా పరిశీలించి, కలిగి ఉండని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగం కన్నా ప్రాణం విలువైనదని, వాహనదారులంతా రోడ్డు నియమాలు పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు.

ప్రజాభిప్రాయ సేకరణ



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: విద్యుత్ శాఖ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం గురువారం చేపట్టింది. ఆ శాఖ ఈఈ టిజికె.మూర్తి నేతృత్వంలో స్థానిక ఏపీ ఈపీడీసీఎల్ కార్యాలయంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యుత్ సంస్థల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించి ప్రజాభిప్రాయాలను స్వీకరించారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో అమలు చేయనున్న విద్యుత్ చార్జీల అమలుకు సంబంధించి శాఖపరమైన నియంత్రణ మండలి ఈ సందర్భంగా తమ విధి విధానాలు ప్రజలకు వివరించింది. మరో రెండు రోజులు ఈ కార్యక్రమాన్ని ఉదయం 10.30 నుంచి ఒంటిగంట వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 వరకు నిర్వహిస్తామని ట్రాన్స్‌కో డీఈఈ మోహన్‌చక్రవర్తి తెలిపారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ – 2 కేంద్రాన్ని ఆమె గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను, సరుకుల వివరాలను పరిశీలించారు. ఆహార పదార్థాల రుచిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం భోజనాన్ని అమలు చేయాలన్నారు. పిల్లలకు సంబంధించిన ఎత్తులు, బరువుల రికార్డులను నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్ పి.కృష్ణవేణి తదితరులున్నారు.

వైద్య శిబిరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అభినవ్‌కుమార్

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి ధర్మలక్ష్మీపురంలో 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ గురువారం కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో డాక్టర్ పి.అభినవ్ కుమార్ 32 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా ముందులు అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. నీలకంఠాపురం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. శిబిరంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గిరిజారాణి, 104 సిబ్బంది, ఎంఎల్‌హెచ్ పి.పుష్పలత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడితే చర్యలు



సంతలో తూనిక రాళ్లను పరిశీలిస్తున్న ఎస్ఐలు

కురుపాం: తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ శాఖ ఇన్‌స్పెక్టర్లు కె.రత్నరాజు, ఎ.బాలకృష్ణ, టి.శ్రీధర్ అన్నారు. కురుపాం వారపు సంతలో గురువారం పర్యటించిన వారు వ్యాపారులు వినియోగిస్తున్న తూనిక యంత్రాలను పరిశీలించి తూనిక రాళ్ల, ధర్మకాటా, ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లకు లీగల్ మెట్రాలజీ శాఖ సీల్ ఉందో లేదో పరిశీలించారు. వ్యాపారులకు సూచనలు ఇచ్చి వినియోగదారులకు అవగాహనను కల్పించారు. మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సంతలో వ్యాపారులకు హెచ్చరించారు.

నీటి సంరక్షణే ప్రధానం

- వాటర్ షెడ్ ప్రాజెక్టు ఆఫీసర్ పోలినాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ పోలినాయుడు

గుమ్మలక్ష్మీపురం: నీటి సంరక్షణే లక్ష్యంగా వాటర్ షెడ్ పథకం కార్యకలాపాలు చేపడుతున్నట్లు గుమ్మలక్ష్మీపురం వాటర్ షెడ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రెడ్డి పోలినాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గురువారం ఆయన అజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా భూ వనరులు మరియు జీవనోపాధి కోసం వాటర్ షెడ్ విధానాన్ని అనుసరించి నీటి సంరక్షణ ఎలా చేపట్టాలి అనే అంశంపై గుమ్మలక్ష్మీపురం మండల వాటర్ షెడ్ పరిధిలోని మైక్రో వాటర్ షెడ్స్ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, కమిటీ చైర్మన్ మరియు కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. వాటర్ షెడ్ పథకం ద్వారా ఊట కుంటలు, చిన్న ఊట కుంటలు, చెక్ డ్యాంలు, చెక్ వాల్స్ మరియు ఫారం పాండ్స్‌ల నిర్మాణాలను ఎంపిక చేసిన గ్రామాల్లో విరివిగా చేపట్టడం తద్వారా నీటిని సంగ్రహించి, నీటి నిల్వ మరియు నీటి విడుదల ద్వారా భూగర్భ జలాలు పెంపొందించడం జరుగుతుందంటూ పలు సూచనలు చేశారు. సమావేశంలో పథకం సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన



అర్నాడు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని అర్నాడ సచివాలయాన్ని ఎంపీడీఓ రమేష్ గురువారం సందర్శించారు. ఫేషియల్ యాప్‌పై సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయంలో ప్రజలకు అందిస్తున్న సేవలను రికార్డుల ద్వారా తెలుసుకున్నారు. అదే పంచాయతీలోని కొత్తవలస గ్రామంలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. బిల్లులు ఆలస్యం కాకూడదని ఏఈకి సూచించారు. బిల్లులు కూడా కట్టిన మేరకు అక్కౌంట్లలో జమ అయినట్లు లబ్ధిదారులు తెలిపినట్లు ఎంపీడీఓ తెలిపారు.